ఉపాధి ఉంటే దక్షిణాదికి వలసలెందుకు?

- నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గుదల
- సిఎం పదవి చేపట్టినప్పటికంటే జెడ్‌పిటిసి అయినప్పుడే ఎక్కువ ఆనందం
- నల్లధనాన్ని ఇం'ధనం' మార్చి సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు : సిఎం రేవంత్



ఉద్యోగం పొందిన అభ్యర్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న సిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

యుపి, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి ఉత్తరాదిలో రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అద్భుతంగా ఉంటే ఎక్కడ నుంచి దక్షిణాది రాష్ట్రాల్లోని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు వలసలెందుకు పెరుగుతున్నాయని బిజెపి నేతలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి వాళ్ళు సాధించినట్టా? మేం సాధించినట్లా అని అడిగారు. తెలంగాణలో నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గిందని, నిత్యావసరాల ధరల పెరుగుదల అతి తక్కువగా 1.3 శాతం నమోదైందని కేంద్రమే చెబుతోందని వివరించారు. కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా..విమర్శలొస్తున్నా పారదర్శకమైన పాలన అందించడం, తెలంగాణను దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మరోమారు స్పష్టం చేశారు. సిఎం పదవి చేపట్టినప్పటి కంటే జడ్‌పిటిసిగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని, జీవితంలో తొలి అవకాశం ద్వారా వచ్చే అనుభూతి కలకాలం నిలిచిపోతుందని గుర్తుచేసుకున్నారు. గురు.. నరం.. బేషరం అనే నానుడి భిన్నంగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి రిటైర్డ్ అయ్యే వరకు స్వభావాన్ని మార్చుకోవద్దని కొత్తగా ఉద్యోగబాధ్యతలు చేపడుతున్న వారికి సూచించారు. తాను జడ్‌పిటిసి ఉన్నప్పుడు ఏదైతే స్వభావంతో ఉన్నానో సిఎం అయినప్పటికీ దాన్నే కొనసాగిస్తున్నానని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన 922 మందికి నియామక పత్రాలను మంత్రి సీతక్కతో కలిసి సిఎం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారికి సులువుగా, పారదర్శకంగా అనుమతులిచ్చేలా రూపొందించిన బిల్డ్‌నౌ పోర్టల్‌ను సిఎం ఆవిష్కరించారు. ఈ రోజు దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిఎస్ శాంతికుమారి, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు శంకర్, కాలెయాదయ్య, ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, మాజీ ఎంపి వేణుగోపాలాచారి, పాల్గొన్నారు.

కాలగర్భంలో పదేళ్ల విలువైన సమయం

ప్రతి వ్యక్తి జీవితంలో పదేళ్ల సమయం ఎంతో విలువైనదని, గత ప్రభుత్వం కారుణ్యనియామకాలు చేపట్టకపోవడం వల్ల పదేళ్ళ కాలగర్భంలో కలిసిపోయాయని సిఎం ఆవేదన వ్యక్తంచేశారు. జాబ్‌క్యాలెండర్‌తో పాటు కారుణ్యనియామకాలను క్రమం తప్పకుండా చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. గత ప్రభుత్వ వైఫల్యం, బాధ్యతారాహిత్యం వల్లనే 20 నుంచి 25 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు గందరగోళంగా మారాయని వాపోయారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని ప్రాధాన్యతగా తీసుకుని ఏడాదిలోనే 57,924 మందికి కొత్త ఉద్యోగాలిచ్చిందని చెప్పారు. ఉమ్మడి ఎపి చరిత్రలోగానీ, గుజరాత్ చరిత్రలోగానీ ఒక్క ఏడాదిలో 59 వేల ఉద్యోగాల భర్తీ ఎవరైనా చేపట్టారా? అని ప్రశ్నించారు. పారదర్శకంగా, ఒక క్రమ పద్ధతిలో పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల నియామకాలు చేపడుతూ ముందుకెళ్తున్నామన్నారు. నోటిఫికేషన్లన్నింటినీ ఒకేసారి విడుదల చేయొద్దని గతంలో ఎప్పుడైనా ఆందోళనలు జరిగాయా? అని అడిగారు. ఒకేసారి 563 గ్రూప్ వన్ పోస్టులను ఎన్నడూ భర్తీ చేయలేదన్నారు. 30 నుంచి 40 రోజుల్లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తన కుటుంబ సభ్యులుగా భావించి వారి కళ్లలో ఆనందం చూడాలని ఎల్‌బిస్టేడియం, రవీంద్రభారతి వేదికలుగా కుటుంబ సభ్యుల సమక్షంలో నియామక పత్రాలు అందజేస్తున్నామన్నారు.

అన్నీ అడ్డుకునే ప్రయత్నం

మేము చేయలేదు కాబట్టి వారిని చేయనియ్యం అన్నట్టుగా తాము చేస్తున్న ప్రతి దాన్నీ అడ్డుకునే ప్రయత్నాన్ని బిఆర్‌ఎస్ వాళ్ళు చేస్తున్నారని సిఎం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబం కేంద్రంగా నిర్ణయాలు జరిగితే తమ ప్రభుత్వంలో ప్రజలు, విద్యార్థులు, రైతుల కోణంలో నిర్ణయాలు జరుగుతున్నాయని వివరించారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచొద్దని మేము చెప్పామా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల ఇంజనీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నాయని, వారిలో సరైన స్కిల్స్ లేకపోవడం వల్ల కేవలం 10 వేల మందికే ఉద్యోగాలు దక్కుతున్నాయని, మిగతా వారంతా నిరుద్యోగులుగా మారుతున్నారని వివరించారు. వారిలో స్కిల్స్ పెంచేందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు.

సోషల్‌మీడియా వేదిక విష ప్రచారం..

'మీకు ఉద్యోగాలు ఇచ్చినందుకు నాపై కోపం ఉందా?20,617 కోట్లతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసినందుకు రైతులు నాపై కోపంగా ఉన్నారా? ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ఆడబిడ్డలు నా మీద కోపంగా ఉన్నారా? 1000 బస్సులకు ఓనర్లను చేసినందుకు..వెయ్యి మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టుకునే అవకాశం కల్పించినందుకు మహిళా సంఘాలు కోపంగా ఉన్నాయా? డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు పిల్లలు నా మీద కోపంగా ఉన్నారా? 57 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించినందుకు కోపంగా ఉన్నారా? ఇన్ని చేసిన తనపై ప్రజలు ఎందుకు కోపంగా ఉంటారు. కావాలనీ బీఆర్‌ఎస్ వాళ్లు సోషల్‌మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.

గడీల్లో పెరగలేదు..నల్లమల అడవుల్లో పెరిగా

తాను గడీల్లో పెరగలేదనీ, నల్లమల బిడ్డగా పేదలు, చెంచుల మధ్య పెరిగానని సిఎం చెప్పారు. తనకు పాలనపై పట్టులేదని బీఆర్‌ఎస్ వాళ్లు చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. ఎన్నడూ సచివాలయానికి రాకుండా ఫాంహౌజ్‌లో ఉండేవాళ్లకు పాలన మీద పట్టు ఉన్నట్టా? అని ప్రశ్నించారు. తాము ప్రతిరోజూ సచివాలయానికి వస్తున్నామనీ, రాష్ట్ర అభివృద్ధి కోసం తాను, తన క్యాబినెట్ 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. త్వరలో వైటిడిఎ బోర్డు కమిటీని వేయబోతున్నట్టు ప్రకటించారు.

కమీషన్ల కోసం గత పాలకులు 11 శాతం వడ్డీకి అప్పు తెచ్చారు

ఒక వ్యక్తి, ఒక కుటుంబం కమీషన్ల కోసం చేసిన అప్పు నేడు తెలంగాణ ప్రజలకు భారంగా మారిందని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వలేక గత ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయస్సును 57 ఏండ్ల నుంచి 61 ఏళ్లకు పెంచిందని విమర్శించారు. ఇప్పుడు రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ రూ.8 వేల కోట్ల మేర పేరుకుపోయాయని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రతినెలా రూ.. మూడువందల కోట్ల రూపాయలను సర్దుబాటు చేస్తున్నదని, అత్యవసరం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి క్లియర్ చేస్తున్నామని తెలిపారు.

ఇసుక మీద ఏడు వేల కోట్ల రూపాయల దోపిడీ

గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా ఏడువేల కోట్ల రూపాయలను దోపిడీ చేసిందని సిఎం ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టారని అధికారుల సమీక్షలో తేలిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణాలకు వాడిన సీకు, సిమెంట్ వినియోగం లెక్కలు తీయిస్తే..1.25 మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ పద్ధతిలో తరలుతుందని బయటపడిందన్నారు. అందుకే నగరంలో శాండ్ బజారులను ఏర్పాటు చేపించామని, అక్కడ నుంచి నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు.

గ్లోబల్ బ్రాండ్ మార్క్‌గా హైదరాబాద్

తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహిస్తే తప్పేంటని సిఎం ప్రశ్నించారు. దానిపై అవగాహన లేని వారే విమర్శిస్తున్నారని దెప్పిపొడిచారు. ఆ పోటీలకు 120 దేశాల నుంచి ప్రతినిధులు వస్తారని, ప్రపంచ నలుమూలల నుంచి మూడు వేల మంది న్యూస్‌ఛానళ్ల, పేపర్ల జర్నలిస్టులు వస్తారని తెలిపారు. దీని ద్వారా గ్లోబల్‌లో హైదరాబాద్ బ్రాండ్ మార్క్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ 72 సార్లు ఆ పోటీలు జరగ్గా..భారతదేశంలో ముంబయి నగరంలో ఒక్కసారే జరిగాయనీ, రెండోసారి హైదరాబాద్‌లో జరుగబోతున్నాయని గుర్తుచేశారు. ఆ పోటీల ద్వారా నెలపాటు హోటల్, ఫుడ్, ట్రాన్స్‌పోర్టు రంగాలకు వందల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మెక్‌డొనాల్డ్ కంపెనీ హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆఫీసు పెట్టడానికి ముందుకొచ్చిందని చెప్పారు. అమెజాన్ కంపెనీ కూడా తన కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నదన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

మీడియా అడ్వైజరీ కమిటీని ప్రకటించండి

- మంత్రి శ్రీధర్‌బాబుకు టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో ఫెడరేషన్ ప్రతినిధి బందం కలిసి వినతిపత్రం సమర్పించింది. అసెంబ్లీ మీడియా పాసుల గడువు ముగిసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ కొత్త పాసులు ఇవ్వలేదని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మంత్రి దష్టికి తీసుకెళ్లారు. పాత పాసుల కారణంగా అసెంబ్లీ ఎంట్రీ సమయంలో పోలీసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ, గడువు ముగిసిన పాస్‌ల వినియోగం జర్నలిస్టులకు ఇబ్బందిగా ఉన్నదని ఫెడరేషన్ బందం మంత్రికి ఫిర్యాదు చేసింది. అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ లేకపోవటం వల్ల మీడియా పాస్‌ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని గుర్తు చేశారు. మీడియా సలహా కమిటీని వెంటనే ప్రకటించి కొత్త పాసులు జారీ చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ మంత్రికి విజ్ఞప్తి చేసింది. ఇందుకుగాను మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమై వెంటనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్. రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామకష్ణ, సీనియర్ జర్నలిస్టులు ప్రదీప్, వెంకన్న , పూర్ణచందర్‌రావు తదితరులు ఉన్నారు.

గాంధి ఆస్పత్రిలో ఎమర్జెన్సీకి అదనంగా 30 పడకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెరుగుతున్న రోగులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో అదనంగా 30 పడకలను ఏర్పాటు చేశారు. అత్యవసర విభాగంలో ఏర్పాటు చేసిన బెడ్లను సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలందించేందుకు వీలుగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి గురువారం మెడికల్, పారామెడికల్ విభాగాలతో సమావేశం నిర్వహించారు. రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని ఆమె పలు సూచనలు చేశారు. అదనంగా ఏర్పాటు చేసిన 30 పడకల్లో 15 బెడ్లను శస్త్ర విభాగం కోసం, మరో 15 బెడ్లను వైద్య చికిత్స విభాగం కోసం కేటాయించినట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె సునీల్, విభాగాధిపతులు డాక్టర్ ఎల్ సునీల్ కుమార్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ వాల్యాతో పాటు పలువురు వైద్య అధికారులు, నర్సింగ్, సాంకేతి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్స్ అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం కీలకం

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల కార్పొరేట్ ఆస్పత్రిగా పేరున్న నిమ్స్ ఆస్పత్రి అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం ఎంతో ఉందని ఆస్పత్రి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఆస్పత్రికి ప్రాధన్యత ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా నిమ్స్‌కు రూ.402.73 కోట్లు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యులు, ఉద్యోగులు శక్తి వంచన లేకుండా నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు భిన్నంగా ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలను కొనుగోలు చేస్తూ సేవల్ని విస్తరించడంతో పాటు వేగంగా వైద్యం అందేలా చేస్తున్నట్టు తెలిపారు. ఆస్పత్రి చైర్మన్‌గా సిఎం రేవంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూడా ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఆస్పత్రి సేవలు ఎక్కువ మంది పేదలకు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు డైరెక్టర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో వేతనాలకు రూ.292.93 కోట్లు, ఇతర ప్రోత్సాహకాలకు రూ.24 కోట్లు, అత్యవసర పరికరాలకు రూ.16.50 కోట్లు, సహాయక గ్రాంట్‌కు రూ.11.40, బిపిఎల్‌కు రూ. 7.90 కోట్లు, నిమ్స్ విస్తరణకు రూ.50 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు.

పెన్షన్‌ల పెంపునకు నిధులేవి..?

- రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు మొండి చేయి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్



నినాదాలు తెలుపుతున్న కె వెంకట్, పెన్షనర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షన్‌ల పెంపునకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులెందుకు కేటాయించలేదని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్‌పిఆర్‌డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన అన్యాయాన్నే 2025-26 బడ్జెట్‌లో చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,26,982 కోట్ల రెవెన్యూ వ్యయం బడ్జెట్‌లో 2016 ఆర్‌పిడి చట్టం ప్రకారం బడ్జెట్‌లో వికలాంగులకు 5శాతం అంటే రూ.11,349.1కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కానీ, వికలాంగుల అభివృద్ధి, సంక్షేమానికి పైసా కూడా కేటాయించలేదన్నారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగంగా వికలాంగుల సంక్షేమ శాఖను చూపి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రంగాలకు నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం 12 శాతం జనాభా ఉన్న వికలాంగుల సంక్షేమానికి నిధులెందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని, కొత్తవి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్‌లో మాత్రం అందుకు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో 151 అంశాలను ప్రస్తావించారని, అందులో వికలాంగులకు సంబంధించిన ఒక్క అంశం కూడా లేదన్నారు. వికలాంగులకు స్వయం ఉపాధి రుణాలు, వివాహ ప్రోత్సాహకం, సహాయ పరికరాల కోసం నిధులు కేటాయించకుండా ఏవిధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. నిధుల కొరత వల్ల వికలాంగుల కార్పొరేషన్ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి ప్రత్యేకంగా వికలాంగుల సంక్షేమానికి, ఆసరా పెన్షన్స్ పెంపునకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు కె చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, షైన్ బేగం, రమేష్, శివ, మోజీష్ నాగరాజు, నరసింహ, బుచ్చమ్మ, భాను, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదు

- బిఆర్‌ఎస్ పార్టీ విప్ కెపి వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో చేసిందేమి లేదనీ, అదే విధంగా రాబోయే కాలంలో చేసే దానిపై అసలు స్పష్టతే లేదని బిఆర్‌ఎస్ పార్టీ విప్ కె.పి.వివేకానంద విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవాస్తవాలతో కూడిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కనిపించలేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక 11 బడ్జెట్లు ప్రవేశపెట్టారని, ప్రస్తుత బడ్జెట్ అంత ఘోరంగా ఏ బడ్జెట్ లేదన్నారు. గత బడ్జెట్ లో కేటాయించి ఖర్చు చేయకుండా అవే నిధులను మళ్లీ ప్రస్తుత బడ్జెట్ లో చూపించారని తప్పుపట్టారు. రాష్ట్ర రాబడిలో 60 శాతం రాబడి తెస్తున్న హైదరాబాద్‌ను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరానికి నాలుగు వైపులా బీఆర్‌ఎస్ ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. మెట్రో రైల్-2,3 ఫేస్‌లో గతంలో కేటాయించిన నిధులనే విడుదల చేయలేదని తెలిపారు. ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ సిటీ, స్కిల్ ఇండియా పేరుతో ప్రభుత్వం చేస్తున్న హైరానాకు గ్రేటర్ హైదరాబాద్ వాసులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ఇన్సైడ్ ట్రేడింగ్, భూదందా చేస్తున్నారని ఆరోపించారు. గత బడ్జెట్‌లో నియోజకవర్గానికి 3,000 ఇళ్లు ఇస్తామని చెప్పి రూ.22,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అరచి పెట్టిన దాఖలాలు లేవని తెలిపారు. గ్రేటర్ హైదరాబాదులో దాదాపు 40 శాతం వీధిలైట్లు లేదని, వాటి నిర్వహణ కూడా ప్రభుత్వానికి చేతనవడంలేదని చెప్పారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలకై నగరంలో పది లక్షల సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కానీ వాటి నిర్వహణ లేక రోజురోజుకు నగరంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని వివరించారు. దీంతో నేరాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

తట్టెడు మన్ను కూడా తీయకుండా హైదరాబాద్ నగరంలో 31 ఫ్లైఓవర్‌ల పనులు, 17 అండర్ పాస్‌ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ సర్కారు 2022-23 సంవత్సరానికిగాను రూ.2,41,275 కోట్ల ఐటీ ఎగమతలను సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ, హెచ్‌ఆర్‌డిసిఎల్, ఎస్ఎన్‌డిపి, ఎస్‌ఆర్‌డిపి పనులపై బడ్జెట్లో ప్రస్తావించలేదని చెప్పారు. హైదరాబాదు నగరంపై ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తామనీ, ప్రభుత్వాన్ని నిలదీస్తామనీ, అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వాణిజ్య వాహన రుణాల్లోకి పూనావాలా ఫిన్‌కార్ప్

హైదరాబాద్ : సైరస్ పూనావాలా గ్రూప్‌నకు చెందిన పూనావాలా ఫిన్ కార్ప్ లిమిటెడ్ (పిఎఫ్ఎల్) కొత్తగా వాణిజ్య వాహన (సివి) సెక్యూర్డ్ రుణ వ్యాపారంలోకి ప్రవేశించినట్లు తెలిపింది. అదే విధంగా సివి ఆపరేటర్లకు రవాణా సామర్థ్యాలను మెరుగుపరచడం ద్వారా అవసరమైన లాజిస్టిక్స్, సరఫరా చైన్ రంగాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పిఎఫ్ఎల్ ఎండి, సిఇఒ అరవింద్ కపిల్ తెలిపారు. తొలి దశలో 12 రాష్ట్రాలలో 68 ప్రదేశాలల్లో కార్యకలాపాలను ప్రారంభించాలని యోచిస్తోన్నామన్నారు.



కబ్జాకు పాల్పడితే చర్యలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- గంగారం చెరువు కబ్జాల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంగారం పెద్ద చెరువు కబ్జాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలోని గంగారం పెద్ద చెరువును జిహెచ్ఎంసి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బందితో కలిసి రంగనాథ్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. చెరువు చుట్టూ ఎక్కడెక్కడ కబ్జాలు జరుగుతున్నాయి.. ఎంతమేర మట్టి పోశారు.. చెరువులో మట్టి నింపింది ఎవరు.. అనే దానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు కబ్జాలకు గురవుతుంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది తీరుపై రంగనాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. గంగారం పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చామని తెలిపారు. చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించి గత మూడు నెలల్లో చెరువులో మట్టి పోస్తూ పూడుస్తున్న పలువురిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో హైడ్రా సిబ్బంది ఫిర్యాదు చేశారని, కేసులు కూడా నమోదైనట్టు వివరించారు. కబ్జాలకు పాల్పడేందుకు ముందుగా చెరువులో మట్టిని పోస్తారని, అనంతరం అక్కడ నిర్మాణాలు మొదలవుతాయని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు, చిన్నారులకు నాణ్యమైన బాలామృతం

- ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ఫహీమ్

హైదరాబాద్ బ్యూరో : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, చిన్నారులకు నాణ్యమైన బాలామృతం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ఫహీమ్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లో నాచారంలోని తన కార్యాలయంలో ఎండి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా జిల్లాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఇటీవల పరిశీలించారు. అక్కడి పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాలామృతాన్ని నాణ్యతాయుతంగా తయారీ చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఫుడ్స్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీక అందాల పోటీలు

- మే ఏడు నుంచి 31 వరకు హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలు
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అందాల పోటీలు స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీకని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ టూరిజం శాఖ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 72వ మిస్‌వరల్డ్ పోటీల ఏర్పాట్లపై టూరిజం ప్లాజాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'మహిళల ఆత్మ సౌందర్యాన్ని వేడుకగా నిర్వహించడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది. రాష్ట్రంలో అన్ని రంగాల్లో వారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మే ఏడు నుంచి 31వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను ప్రపంచానికి తెలియజేసేందుకు ఎంతో ఉపయోగపడతాయి. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బిటిఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరుప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగా లబ్ది చేకూరుతుంది' అని జూపల్లి అన్నారు. అందాల పోటీలను రాజకీయ కోణంలో చూడకూడదని పేర్కొన్నారు. ఈ పోటీలకు రూ.50 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశామనీ, అందులో నిర్వాహకులు రూ.25 కోట్లు భరిస్తున్నారని తెలిపారు. మిగతా రూ.25 కోట్లు మాత్రమే తెలంగాణ టూరిజం ఖర్చు చేయనుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయిని వివరించారు. 'ప్రపంచంలోని 140 దేశాల నుంచి పోటీదారులతో పాటు దేశవిదేశాలకు చెందిన వేలాది మంది వస్తారు. తెలంగాణ గురించి ప్రపంచానికి చెప్పేందుకు ఇది మంచి అవకాశం. ఈ వేదికతో రాష్ట్ర పర్యాటక రంగానికి రాబడి పెరుగుతుంది" అని జూపల్లి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర వారసత్వ సంపద, చేనేత రంగం, జానపద నృత్యాలు, సంగీతం, వంటకాల వంటివి పోటీలు జరిగే ప్రాంతాల్లో ప్రదర్శించనున్నామని తెలిపారు.

భారతీయ చీరకట్టు నచ్చింది:మిస్ వరల్డ్ క్రిస్టినా

భారతీయ చీరకట్టు బాగా నచ్చిందని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అన్నారు. ఇక్కడి కళలు, సంప్రదాయాలు మానవీయ విలువలను బోధిస్తాయని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం ఎంతో గొప్ప భావన అని పేర్కొన్నారు. ఎన్నో భాషలున్నా అంతా ఒక్కటిగా ఉండటం భారత్‌కే సాధ్యమైందని గుర్తు చేశారు. మిస్ వరల్డ్ కూడా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని క్రిస్టినా అన్నారు. ఈ దేశ ప్రజలు తనకు గొప్పగా స్వాగతం పలికారనీ, వారి అభిమానానికి రుణపడి ఉంటానని చెప్పారు.

నేటినుంచి పది పరీక్షలు

- హాజరుకానున్న 5,09,403 మంది విద్యార్థులు
- 2,650 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియెడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణ కోసం పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు సబ్జెక్టు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్‌గా వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు హాజరవుతారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్ (సిఎస్), 2,650 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లతోపాటు 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షలు జరిగే సమయంలో ఆ చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలి. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు ఉదయం 9.35 గంటల వరకు అనుమతి ఉంటుంది. అంటే విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియెడ్ ఉంటుంది. ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీనియర్ అధికారులను జిల్లా స్థాయిలో పరిశీలకులుగా నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడాన్ని నిషేధించారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి ప్రశ్నాపత్రాలపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను సమాధానాలు రాసేందుకు ఇస్తారు.

టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- జియోలాజికల్ సర్వే అధికారుల సూచనలతో పనులు
- ఉన్నతాధికారుల సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారుల సూచనలను పాటిస్తూ ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ ఉన్నతాధికారులు, సహాయక బృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై, తీసుకోవాల్సిన భద్రత ప్రమాణాలను విశ్లేషించారు. సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఊట నీటిని అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు.

స్టీలును, మట్టిని పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు. నీటి ఊటలు, మట్టి ఎక్కువగా ఉండటం వంటి సవాళ్లను అధిగమించేందుకు యంత్రాలు, ప్రత్యేక నిపుణులను రంగంలోకి దించినట్టు వివరించారు. సహాయక చర్యలు ప్రతి రోజూ 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయని, ఉదయం 7 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు, 11 గంటల షిఫ్టుల్లో, ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేయిస్తున్నారని వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 26 రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా 5 షిఫ్టులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

నిరుపేదల ఇళ్లకు రూ.8 వేల కోట్లు ఏ మూలకూ సరిపోవు

- ఇతర రంగాలు, పథకాలకు తగిన బడ్జెట్ ఏదీ..?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది ఉన్నారని, ఈ బడ్జెట్లో వారికి రూ.8000 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ విలేకరులతో మాట్లాడుతూ.. గత బడ్జెట్‌కు, ఈ బడ్జెట్‌కి ఏమీ తేడా లేదన్నారు. పెరుగుతున్న పెన్షన్లకు నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.12 లక్షలకు సంబంధించి అమలుకు నోచుకోలేదని అన్నారు. బిసి సంక్షేమానికి రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 7.6 శాతం మాత్రమే నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ అమలుకు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో కోత విధించారన్నారు.

ఆరు గ్యారంటీల అమలు కోసం, స్థానిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల మొత్తం సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గుర్తించిన సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్, మండ్ల రాజు, జిఎస్ గోపి, ఎ లక్ష్మి, నాయకులు ఆర్ఎన్ రమేష్, ఎస్.రాజు, పరమేశ్వర చారి, బి.వెంకటేష్, జి.వెంకటయ్య, వెంకట్, రాములు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం, తాను నాయక్‌కు నివాళులు

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకులు మల్లు స్వరాజ్యం, తానునాయక్ వర్థంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు జాన్‌వెస్లీ పూలమాలలేసి నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం, తాను నాయక్ ఆశయ సాధన కోసం దున్నేవానికి భూమి పంచేవరకు పోరాటాలు చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు.



మల్లు స్వరాజ్యం, తాను నాయక్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి : జాన్‌వెస్లీ

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్స్యూరెన్స్, విఆర్ఎస్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలను చేశారని పేర్కొన్నారు.

వారి సమస్యలు పరిష్కరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అవి అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రయివేటీకరణతోపాటు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని విమర్శించారు. పిఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 56 కేంద్రాల్లో ప్రారంభిం చిందనీ, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో కొత్త విధానాన్ని తెస్తున్నదని వివరించారు. దీంతో పేదలు అంగన్‌వాడీ కేంద్రం అందిస్తున్న సేవలకు దూరమవుతారని తెలిపారు. ఫలితంగా ఐసిడిఎస్ బలహీనపడి మూతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పిఎంశ్రీ పథకంతోపాటు, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్రంలో పూర్తిగా రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన పది నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు.ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలతోపాటు, టార్గెట్ రద్దు లాంటి అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని జాన్‌వెస్లీ తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, పరిష్కారానికి ఐఏఎస్ అధికారితో కమిటీ వేసి, ఆ ప్రతిపాదనల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు వేతనాలను పెంచుతామనీ, ఉద్యోగ భద్రత కల్పిస్తామనీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిందని తెలిపారు. కానీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సెలవులు, ఎఎన్‌సి, పిఎస్‌సి తదితర టార్గెట్ల రద్దు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, అన్ని ఆస్పత్రుల్లో ఆశాలకు విశ్రాంతి గదుల ఏర్పాటు, పారితోషికాల్లో సగం పెన్షన్ తదితర న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



జహీరాబాద్‌లో రోడ్డెక్కిన పాడి రైతులు

- మద్దతు ధర కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలకు మద్దకు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పాడి రైతులు రోడ్డెక్కారు. రహదారిపైనే పాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు స్థానిక అతిథి గృహం నుంచి జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మహిపాల్‌రెడ్డి, రవి తదితరులు మాట్లాడుతూ.. ప్యాకెట్ పాలకున్న ధర స్వచ్ఛమైన పాలకు ఉండదా అని ప్రశ్నించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న హట్సన్ కంపెనీకి సంబంధించిన పాల పరిశ్రమ యజమాన్యంతో పాటు వివిధ కంపెనీలకు చెందిన డైరీ నిర్వాహకులు తమ వద్ద కొనుగోలు చేస్తున్న పాలకు కేవలం లీటర్ రూ.60 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. తమ వద్ద కొనుగోలు చేసిన పాలను డొనేట్ చేసి లీటర్ రూ.90కి విక్రయిస్తున్నారన్నారు. కలుషితమైన ప్యాకెట్ పాల కంటే తమ స్వచ్ఛమైన పాలకు మద్దతు ధర ఎక్కువగా ఉండాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఉన్నతాధికారులు ఆలోచించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు రాజు, నర్సింలు, మైనోద్దీన్ గుడి సాబ్, చంద్రకాంత్, నరసింహారెడ్డి, రాజు రెడ్డి, చందనం తదితరులు పాల్గొన్నారు.

ఒయులో ఆంక్షలను ఎత్తేయాలి

- విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టును ఖండిస్తున్నాం
- విసి ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు)లో ఉన్న ఆంక్షలను ఎత్తేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్సిటీలో నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఓయూలో ఉన్న వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి సంపూర్ణమైన మద్దతును ప్రకటించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి పూర్తిగా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒయు విసితో ఇలాంటి సర్క్యులర్ ఇప్పించింది ప్రభుత్వమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఒక వర్సిటీ విసి ఇంతటి అప్రజాస్వామికమైన ఆదేశాలను జారీచేయడమనేది సాధ్యమయ్యేపని కాదని తెలిపారు. కచ్చితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పోకడలకిది నిదర్శనమే అవుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణస్వీకారం చేసే సమయంలో ప్రజాభవన్‌గా తాను మార్చిన ప్రగతిభవన్ ముందు ఉన్న ముండ్ల కంచెలను ధ్వంసం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామన్నారని గుర్తు చేశారు. వారు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అన్నారని తెలిపారు. ఓయూలో ఇప్పుడు జరుగుతున్నదేమిటని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలను కాంగ్రెస్ నాయకత్వం మరచిపోయిందా?అని అడిగారు. వర్సిటీ కేంద్రాలు భావ సంఘర్షణ కేంద్రాలుగా విరసిల్లాలంటూ నెహ్రూ చెప్పారని గుర్తు చేశారు. రాజకీయులు, ప్రజాస్వామ్య విలువలుంటాయని తెలిపారు. ఇవన్నీ పక్కనపెట్టి ఓయూలో కనీస ప్రజాస్వామ్య విలువలకు అవకాశం లేకుండా ధర్నాలు చేయొద్దు, ప్రదర్శనలు చేయొద్దు, వినతిపత్రాలు ఇవ్వొద్దు, నిరసనలు తెలపొద్దని సర్క్యులర్ ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉన్నదని తెలిపారు. ఇది వీసీకి సంబంధించిన విషయం, తమకు సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సర్క్యులర్‌ను తక్షణమే విరమించుకోవాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం మరింత విస్తరిస్తుందనీ, ఉధృతమవుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేటి తరానికి నాటి తరం గీతాల మాధుర్యం తెలియడం లేదు



ప్రజాశక్తి - అగ్రికల్చరల్

శాసన సభ స్పీకర్‌గా వున్న సమయంలో బిపి, షుగర్ పెరిగినప్పుడు త్యాగరాయ గానసభకు రవీంద్ర భారతిలోని కార్యక్రమాలలో పాల్గొని పాటలు విని ఒత్తిడి తగ్గించుకునే వాడిని అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. నేటి తరాలకు నాటి తరం గీతాల మాధుర్యం తెలియక పోవడం దురదృష్టం అని అవేదన వ్యక్తం చేశారు చంద్ర తేజాలయ మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో విఖ్యాత లలిత సంగీత దర్శకుడు సాయి బాబాకు సత్కారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి సాయి బాబాను సత్కరించి లలిత సంగీత స్వర రాగ మహా చక్రవర్తి బిరుదు ప్రదానం చేసి మాట్లాడారు. సాయి బాబా ఎందరో గాయనీ గాయకులుకు గురువుగా అమ్మచేతి భోజనం రుచిలా నేర్పించారు అని అభివర్ణించారు. కవి డాక్టర్ ఎం కె రాము మాట్లాడుతూ సాయిబాబాకు సత్కారం లలిత గీతాల పట్టాభిషేకం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ సినిమాలలోకి వెళ్ల కుండా లలిత సంగీత ప్రాచుర్యాన్ని కృషి చేశారు అని చెప్పారు. అధ్యక్షత వహించిన యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ చంద్ర తేజ గొప్ప సంగీత దర్శకుడు సాయిబాబా నుసత్కారంకు ఎన్నుకోవటం విశేషం అన్నారు. స్వర కర్త రామాచారి గాయని విజయ లక్ష్మి సభలో పాల్గొన్నారు. సంస్థ స్థాపకుడు చంద్ర తేజ స్వాగతం పలుకుతూ సాయిబాబా తనను ప్రోత్స హించిన విశేషాలు తెలిపారు. తొలుత చంద్ర తేజ శకుంతల స్వర కల్యాణి జ్యోతి రేవతి విజయ లక్ష్మీ పాడిన పాటలు శ్రోతలను ముగ్ధులను చేశాయి.

భాగస్వాముల కోసం పిబి పార్ట్‌నర్స్ సంవాద్

హైదరాబాద్ : పాలసీబజార్ పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్ విభాగానికి చెందిన పిబి పార్ట్‌నర్స్ హైదరాబాద్‌లో సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించింది. ఏజెంట్ భాగస్వాములు, ఉద్యోగుల మధ్య అర్థవంతమైన సంబంధాలను పెంపొందించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి అన్ని వ్యాపార విభాగాల నుంచి సుమారు 60 మంది టాప్ ఏజెంట్ భాగస్వాములు, ఉద్యోగులు పాల్గొన్నట్లు పిబి పార్ట్‌నర్స్ సహ వ్యవస్థాపకుడు ధ్రువ్ సరిన్ పేర్కొన్నారు.

నటులకు భాష,అభినయం, రూపం ప్రధానం

ప్రజాశక్తి కల్చరల్

టివి నటులకైనా సినీ నటులకైనా భాష అభినయం రూపం ప్రధానం అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి విజయ బాబు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై అభినందన మహిళా సాంస్కృతిక సాంఘీక సేవా సంస్థ నిర్వహణలో అభినందన సీల్ వెల్ టి వి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విజయ బాబు పాల్గొని ఉత్తమ కుటుంబ కథా చిత్రాలు పడమటి సంధ్యా రాగం, మనసంతా నువ్వే దర్శకుడు రాధా కృష్ణతో పాటు నటీ నటులకు అవార్డ్స్ ప్రదానం చేసి మాట్లాడారు. సంప్రదాయ కుటుంబ కదా సీరియల్స్‌ను ఎన్నుకోవడం అభినందనీయం అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ నటుడు ప్రదీప్ మాట్లాడుతూ టివి సీరియల్స్ వాస్తవ జీవితాలకు దర్పణం అన్నారు. వీటిని విమర్శించే వారికి తగిన అర్హత లేదు అన్నారు. నేడు తెలుగు సీరియల్స్ వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి అన్నారు. టివి శక్తి వంత సాధనం సినిమా వారు కూడా టివి వైపు వస్తున్నారని అన్నారు. వేదిక పై సినీ జర్నలిస్ట్ సంజయ్ కిషోర్ తదితరులు పాల్గొనగా అభినందన భవాని స్వాగతం పలికారు తొలుత లాస్య అంజలి భరత నాట్యం ఆకట్టుకుంది.

నకిలీ విత్తనాల పట్టివేత

- కర్ణాటక నుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక నుంచి మంచిర్యాలకు డిసిఎంలో తరలిస్తున్న నకిలీ విత్తనాలను మేడ్చల్ ఎస్ఓటి, శామీర్‌పేట పోలీసులు, వ్యవసాయ అధికారులు పట్టుకున్నారు. 37.50 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్‌తో కలిసి డిసిపి కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాలలోని లక్షెట్టిపేటకు చెందిన సొల్లు సురేష్ డ్రైవర్ నరేష్‌ను కిరాయికి మాట్లాడుకుని కర్నాటకలోని కుష్టగి దగ్గర గల రమణ అలియాస్ రామయ్య నుంచి నిషేధిత పత్తి విత్తనాలు తీసుకురావాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. 50 వేల రూపాయలు కిరాయి ఇస్తానని చెప్పాడు. ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశపడి నరేశ్ తన డిసిఎంలో 150 బస్తాల నిషేధిత పత్తి విత్తనాలు తీసుకుని ఈనెల 19న మంచిర్యాలకు బయలుదేరాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి, మేడ్చల్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఒఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ ఏడు నుంచి తూముకుంట గ్రామం వైపు వెళ్లే రహదారిపై బ్రిడ్జి కింద డీసీఎంను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో నకిలీ పత్తి విత్తనాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

'మహా సరస్వతీ పుష్కరాలు' ఘనంగా నిర్వహించాలి

- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్
- కాళేశ్వరంలో పనులు పరిశీలన, అధికారులతో సమీక్షా సమావేశం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరంలో మహా సరస్వతీ పుష్కరాలు ఘనంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా పనుల ఏర్పాట్లపై ఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరే తదితర అధికారులతో సమీక్షించారు. పుష్కరాల సందర్భంగా సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. విఐపి ఘాట్, గోదావరి ఘాటు వద్ద చేపట్టనున్న పనులను, సత్రం పనులను పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టనున్న పనుల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరస్వతీ విగ్రహం ఏర్పాటుకు స్థలం నిర్ణయించడం, విఐపి ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, పురుషులు, మహిళల కోసం శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, విఐపి ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంచనాల్లో వ్యత్యాసాలు, చేపట్టే పనులపై నివేదికలు రెండు రోజుల్లో అందచేయాలని సూచించారు. పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని అన్నారు. విస్తృత ప్రచారానికి అంబాసిడర్‌ను నియమించాలని తెలిపారు. పుష్కర 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈఓను ఆదేశించారు. ఎండల దృష్ట్యా గోదావరిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, గోదావరిలో నీటి నిల్వలను పరిశీలించాలని అన్నారు. సత్రం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. సందర్శకులకు అన్నదాన కార్యక్రమాలు, ప్రముఖ ప్రాంతాల్లో ప్రసాదాల కౌంటర్లు, సురక్షిత మంచినీటి సరఫరా చేయాలని సూచించారు. గోదావరిలోకి సందర్శకులు వెళ్ళకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో దేవస్థానం ఆర్‌జెసి రామకృష్ణారావు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, దేవస్థానం తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏప్రిల్ 25 నుంచి ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

- రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం
- ఒయులో అప్రజాస్వామిక సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి

: టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి సుధాకర్, తుడుం ప్రవీణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడారు. 20 ఏళ్ల తర్వాత ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరుపుతున్నామని, ఈ సభల్లో రాష్ట్ర విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, పది యూనివర్సిటీల నుంచి ఎంపిక చేసిన వెయ్యి మంది ప్రతినిధులు హాజరు కానున్నట్టు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలో సర్క్యూలర్ పేరుతో నియంతృత్వ విధానాలు, అప్రజాస్వామిక చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాడుతున్న విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ శక్తులను అప్పజెప్పే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు వినోద్, పూజిత, మనోజ్, త్రినాథ్, లోకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒయులో తరగతుల బహిష్కరణ

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలూ చేయకూడదని అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఒయు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం విద్యార్థులు ఒయు ఆర్ట్స్ కళాశాలలో క్లాస్‌లను బైకాట్ చేసి ర్యాలీకి బయలుదేరారు. ఈ నేపథ్యం లో పోలీసులు ఆర్ట్స్ కళాశాలలోకి వెళ్లి విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని వారం రోజులుగా శాంతియుతంగా పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, ఓయూ వీసీ, రిజిస్ట్రార్ స్పందించడం లేదన్నారు. వారు మౌనం వీడాలని డిమాండ్ చేస్తూ ఓయూ అడ్మినిస్ట్రేషన్ వైఖరిని నిరసిస్తూ బంద్ నిర్వహించామన్నారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తామని చెప్పి నేడు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థి ఉద్యమాలపై ఆంక్షలు విధిస్తూ అణచివేస్తున్న సర్క్యులర్‌ను వెంటనే రద్దుచేసి యూనివర్సిటీలో స్వేచ్ఛా వాతావరణం నెలకొల్పాలని, క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 7.5 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారని, రూ.500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలను ఎలా బాగు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు ఉదయ్, నాయకులు లెనిన్, నాగేందర్, శ్రీను, అజయ్, ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, పిడిఎస్‌యు విజృంభన రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనందరావు, పిడిఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష విద్యార్థులను పరామర్శించిన ఎస్ వీరయ్య

అరెస్టయిన విద్యార్థి నాయకులను లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, సాయంత్రం వారిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. సర్క్యులర్‌ను రద్దు చేసి యూనివర్సిటీలో స్వేచ్ఛా వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. ఆయన వెంట సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్, డీవైఎఫ్ఐ మాజీ కార్యదర్శి మహేందర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలపై స్పష్టత కరువు
- వర్సిటీల అభివృద్ధికి నిధులు శూన్యం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వ ఆనవాయితీనే కాంగ్రెస్ కొనసాగించిందని తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. గతం కంటే స్వల్పంగా 0.2 శాతం నిధులను పెంచిందని తెలిపారు. గత బడ్జెట్లో విద్యారంగానికి రూ.21,292 కోట్లు కేటాయించిందనీ, ఈ బడ్జెట్‌లో రూ.23,108 కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నోచుకోబోదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు. చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. బడ్జెట్‌లో ఆ ఊసేలేదని తెలిపారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారనీ, దాని గురించి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి రాష్ట్రంలో రూ.450 కోట్లతో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పాఠశాల విద్యారంగంలో ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు సరిపోవని తెలిపారు. గురుకులాల నిర్మాణం కోసం కూడా కనీస నిధుల్లేవని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 662 పైగా గురుకులాలకు సొంత భవనాలు లేవని తెలిపారు. ఉన్న గురుకులాలు కూడా సరైన మౌలిక సదుపాయాల్లేవంటూ స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారని పేర్కొన్నారు. కానీ వాటి అభివృద్ధి కోసం ఎలాంటి నిధులను కేటాయించలేదని విమర్శించారు. 40 శాతం డైట్ చార్జీలను పెంచామంటూ ఘనంగా చెప్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం అసలు ఈ మెనూ అమలు చేయడం లేదని తెలిపారు. ఆరేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ బకాయిలు రూ.8,258 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటి విడుదల కోసం నిధులను కేటాయించలేదని తెలిపారు. విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేటాయింపులకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్టు వారు పిలుపునిచ్చారు.